# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మేస్త్రీలకు శిక్షణ

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి... 40 మందికి సర్టిఫికెట్లు అందజేత...



శిక్షణ పొందిన మేస్త్రీలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తదితరులు...

ఆదిబట్ల, మార్చి 29: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో తక్కువ ఖర్చుతో ఇండ్లు నిర్మించేందుకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాలో 40 మంది నైపుణ్యం కలిగిన మేస్త్రీలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరెట్‌లో ఎన్ఏసీ బండ్లగూడ ద్వారా శిక్షణ పొందిన 40 మంది మేస్త్రీలకు కలెక్టర్ సర్టిఫికెట్లను అందచేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలివిడత ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ మేస్త్రీలు ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని శిక్షణలో వారికి రోజుకు 300 రూపాయల చొప్పున,డ్రెస్సులు,హెల్మెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎంపిక చేయబడిన గ్రామాల్లో శిక్షణ పొందిన మేస్త్రీలు ప్రతి గ్రామంలో నాలుగు నుండి పది ఇండ్ల వరకు వీరే నిర్మిస్తున్నారని తెలిపారు.రాబోయో కాలంలో ప్రతి నియోజక వర్గంలో 3వేల 5వందల ఇండ్లు నిర్మించడం జరగుతుందని ,ఇంకా కొంత మందికి శిక్షణ ఇచ్చి మేస్త్రీల కొరత ఉన్న గ్రామాలకు పంపడం జరుగుతందని అన్నారు.రెండో విడత శిక్షణలో డీఆర్‌డీఏ ద్వారా మహిళలకు కూడా మేస్త్రీలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు గ్రామాలలో ఈ మేస్త్రీలను వినియోగించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ పిడీ డీసీ నాయక్,ఎన్ఏసీఏడీ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి కలెక్టరేట్ లో మాక్ డ్రిల్

## ప్రజలకు అవగాహన కల్పించిన ఎన్‌డీఆర్ఎఫ్ టీం...



ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా కాపాడుతారో వివరిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ టీమ్

ఆదిబట్ల,మార్చి 29: ప్రకృతి వైపరిత్యాలు,విపత్తులు,అగ్ని ప్రమాదాలు,వరదలు వంటి సంఘటనలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్ఎఫ్ టీం వారు చేపట్టే సహాయక చర్యలు , ప్రమాదాల నుండి ప్రజలను ఏవిధంగా రక్షిస్తారనే విషయంపై శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. భవనాలు కూలిపోయినప్పుడు, కొండ చరియలు విరిగిపడినప్పుడు, వరదలు సంభవించినప్పుడు,తుఫానులు వంటి అనేక విపత్తుల సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ టీం ప్రజలను రక్షిస్తుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తమనుతాము ఏవిధంగా రక్షించుకోవాలో వివరిస్తూ కలెక్టరేట్ అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌డిఆర్ఎఫ్ టీం సభ్యులు, కలెక్టరెట్ ఏఓ సునీల్,కలెక్టర్ సీసీ జనార్థన్, జిల్లా సివిల్ సప్లై అధికారి గంప శ్రీనివాస్,కలెక్టరెట్ సూపరెంటెడెంట్లు,సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల నిరసన దీక్ష



ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అప్రజాస్వామికంగా జారీ చేసిన సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. మండుటెండలో నేలపై చేపట్టిన ఈ దీక్షకు ఓయూ పూర్వ విద్యార్థి నాయకులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియాలో నిరసన చేసే హక్కుని కాలరాయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కే నీచమైన బుద్ధితో రేవంత్ రెడ్డి సర్కారు వ్యవహరించడం దారుణమన్నారు.

# పండగపూట.. సిటీ బస్సులే ఎక్స్‌ప్రెస్‌లంట..!

## ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్న ఆర్టీసీ రూ.200ల టికెట్‌ను రూ.290 వసూలు

సిటీబ్యూరో, మార్చి 29 ( నమస్తే తెలంగాణ ) : దిల్‌సుఖ్‌నగర్ నుంచి సూర్యాపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సు టికెట్ ధర రూ. 200లు ఉంటుంది. అయితే పండుగ దృష్ట్యా ఆ ధరను 290కి పెంచారు. పెంచితే పెంచారేమో గానీ అది నిజంగానే ఎక్స్‌ప్రెస్ బస్సు అయితే ప్రయాణికులు కొంత అంగీకరించేవారేమో. కానీ నగరంలో తిరుగుతున్న సిటీ బస్సును పండుగ పూట ఎక్స్‌ప్రెస్ అంటూ బోర్డు తగిలించి ఎక్స్‌ప్రెస్ బస్సు ధరలకు మించి డబ్బులు వసూలు చేయడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేందని అడిగితే బస్సు దిగిపో అని కండక్టర్లు బెదిరిస్తున్నారని రవి అనే ప్రయాణికుడు చెప్పాడు.

### బస్సులు పెంచకుండా ..!

గ్రేటర్ ప్రయాణికులకే ఇక్కడ నడిచే బస్సులు సరిపోవడం లేదు. సాధారణంగా గ్రేటర్‌లో ఉచిత బస్సు అమలుకు ముందున రోజుకు 11 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేసేవాళ్లు. ఇందులో మహిళా ప్రయాణికులు 5 లక్షల మంది ఉండేవాళ్లు. కానీ మహాలక్ష్మి ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చాక ఇప్పుడు రోజుకు సుమారు 24 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఇందులో 17 లక్షల మంది మహిళలే ఉండటం విశేషం. ఒక్క రోజుకు ఇంత మంది ప్రయాణం కేవలం గ్రేటర్‌లో ఉన్న 2600 బస్సులపైనే ఆధారపడి ఉంది. దీంతో ప్రతీ బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి పోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీ సిటీ బస్సులను జిల్లాలకు ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో తిప్పడంపై విమర్శలు వస్తున్నాయి.



# ఇఫ్తార్ విందులో పాల్గొన్న సీఎం



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్, మార్చి 29: రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం సాయంత్రం కొడంగల్‌లోని ఒక ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి ముస్లీంలకు కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా అన్నింటా ఎదుగుదలను అందించడంతో పాటు అధిక మొత్తంలో అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పార్ల మెంటులో కొనసాగతున్న వక్ఫ్ బోర్డు కొత్త బిల్లుకు సంబంధించి పాత బిల్లు కొనసాగించే విధంగా అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి అందించాలని ముస్లీంలు కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

# మెట్రో రైళ్ల సమయం పొడిగింపు



సిటీబ్యూరో: నగరంలో మెట్రో సమయాన్ని మరో 45 నిమిషాల పాటు పొడిగించారు. ఏప్రిల్ 1 నుంచి రాత్రి 11.45 వరకు మెట్రో సేవలు అందుబాటులో ఉంటాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా మెట్రో స్టూడెంట్ పాస్ ఆఫర్‌ను మరో ఏడాది పొడిగించగా, 2026 మార్చి 31 వరకు ఈ స్కీం అందుబాటులో ఉందన్నారు. ఈ ఆఫర్ ద్వారా 20 ట్రిప్పులకు చెల్లించి 30 ట్రిప్పులను పొందే వీలు ఉందన్నారు.



ఆమనగల్లులో వీరముష్టి కులస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

# కులవృత్తులకే పరిమితం కాకుండా ఆదాయ వనరులను పెంచుకోవాలి

–రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

ఆమనగల్లు, మార్చి 29: సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. కులవృత్తులకే పరిమితం కాకుండా ఆదాయ వనరులను పెంచుకుని అభివృద్ధి చెందాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మీ పిల్లలను చదివించి ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా సంకల్పంతో ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో శనివారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ, ప్రత్యేక అధికారి సతీష్‌తో కలిసి పర్యటించారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఉంటున్న వీరముష్టి కుటుంబాలను కలిసి వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. వారి పిల్లలతో మాట్లాడి చక్కగా చదువుకోవాలని సూచించారు. వీరముష్టి కులం అని చెప్పుకోవాడానికి అవమాననంగా ఉంది వీరభద్రీయ కులంగా మార్చాలని కాటి మేఘన, బొబ్బిలి మహేశ్వరిలు కోరారు. వీరితో పాటు కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తమ కులాన్ని సర్టిఫికెట్లలో వీరభద్రీయ మార్చి బ్రాకెట్లో వీరముష్టి పెట్టాలని కమిషన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో గతేడాది అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఉమ్మడి పది జిల్లాల బీసీ సమస్యల కోసం సమావేశం నిర్వహించామన్నారు. ఆయా కులాల మార్పుపై 15 రోజులు అభ్యంతరాలు స్వీకరించిందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా కులాలకు చెందిన ప్రజలతో ముఖాముఖి నిర్వహించి జీవన స్థితిగతులను తెలుసుకుంటున్నామని అందులో భాగంగానే ఆమనగల్లులో పర్యటించినట్లు ఆయన వివరించారు. ఆదాయ వనరులను పెంచుకుని అభివృద్ధి చెందుతూ పిల్లలు ఉన్నత ఉద్యోగాలు సాధించేదిశగా చక్కగా చదివించాలని సూచించారు. ఇటీవల జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించినపుడు దొమ్మర, బుడుబుక్కల, పిచ్చకుంట్ల , తమ్మిడి కులాల వారు తమ కులం పేరు చెప్పుకోలేక పద్మశాలీ, ముదిరాజ్ కులం సర్టిఫికేట్లు తీసుకుంటున్నామని చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కులాల మార్పునకు బీసీ కమిషన్ రెండు వారాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్, మండల తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఆర్ఐలు చెన్నకేశవులు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అందాల పోటీలను ప్రతిఘటిద్దాం

'మిస్ వరల్డ్' అందాల పోటీల వ్యతిరేక వేదిక

చిక్కడపల్లి, మార్చి 29 : మిస్ వరల్డ్ అందాల పోటీలను ప్రతిఘటించాలని పలువురు మహిళా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందాల పోటీలపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత్రి జూపాక సుభద్ర, పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్యలు మాట్లాడుతూ ప్రపంచ సుందరి పోటీలు 2025 మే నెలలో హైదరాబాదులో జరగనున్నట్టు తెలంగాణ టూరిజం ,హెరిటేజ్ మరియు సాంస్కృతిక శాఖ ప్రకటించింది . మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధినేత జూలియా మెర్లీ తదితరులు తెలంగాణ కు ముఖ్యంగా హైదరాబాదుకు ఉన్న ఘన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిగణలోకి తీసుకొని అందాల పోటీలకు వేదికగా నిర్ణయించామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రదర్శనకు కోట్లాది రూపాయలను కేటాయిస్తూ ఇది రాష్ట్రానికి చాలా లాభదాయకమని రెవెన్యూ జనరేటింగ్ ప్రాజెక్ట్ అని దండోరా వేస్తున్నారని విమర్శించారు. అందాల పోటీల మీద పెట్టే ఖర్చుతో గ్రామీణ హాస్టలల్లో, పాఠశాలల్లో మంచినీళ్లు , టాయిలెట్ సౌకర్యాలను, వైద్య సౌకర్యాలను, చారిత్రక ప్రదేశాలలో వసతులను, భద్రతను మెరుగుపరచవచ్చన్నారు. ఈ సమావేశంలో వివిధ మహిళా సంఘాల నాయకులు అనసూయ , ఆశాలత, స్వరూప, జ్యోతి , శ్రీదేవి,లావణ్య స్త్రీవిముక్తి, శాంత , జ్యోతి,జయ, జి. ఝాన్సీ, ప్రదీప్, జాన్, మహేష్, సత్య, తేజ, జ్యోతి వహీద్,అంబిక, అనిల్, సరిత, గిరిజ, జాన్,శివబాబు, హేమలత , మమత ,అరుణ ,మల్లు లక్ష్మి, శిరోమణి, జయ, వి. సంధ్య, జి. ఝాన్సీ, ప్రదీప్, జాన్, మహేష్ సత్య, తేజ, జ్యోతి వహీద్,అంబిక, అనిల్, సరిత, గిరిజ, జాన్,శివబాబు, హేమలత , మమత ,అరుణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య

### లోకల్ బాడీ ఎమ్మెల్సీకి నామినేషన్

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచేందుకు రెండో రోజున ఒక్క నామినేషన్ దాఖలైంది. దమ్మాయిగూడకు చెందిన కంటె సాయన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలను జీహెచ్ఎంసీ ఎన్నికలాధికారికి సమర్పించారు. మార్చి 28న షెడ్యూల్ విడుదల కాగా, ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు సమర్పించేందుకు గడువు ఉంది. కాగా ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 9న ఉపసంహరణకు ఆఖరు తేదీగా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

### ఎల్ ఆర్ఎస్‌కు అత్తెసరు ఆదరణ

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) లే అవుట్ రెగ్యులరైజేషన్ పథకానికి జీహెచ్ఎంసీ పరిధిలో అత్తెసరు ఆదరణ వచ్చింది. మొత్తం 107872 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, తాజా నోటిఫికేషన్ ప్రకారం 59564 దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్ జారీ చేయగా మార్చి 29 నాటికి 7891 మంది మాత్రమే ఫీజులు చెల్లించగా ఇప్పటివరకు 103.46 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరినట్లుగా జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. అయితే మార్చి 31వరకు 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించుకునే అవకాశం కల్పించినా జనాల నుంచి స్పందన లేకపోవడం గమనార్హం.

### ఒకే కాన్పులో నలుగురు పిల్లలు జననం

తల్లీపిల్లలు క్షేమం



ఆరోగ్యంగా ఉన్న పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న దవఖాన సూపరింటెండెంట్‌రవికుమార్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 29 నీలోఫర్ దవఖానలో ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. నగరంలోని హస్తినాపురానికి చెందిన అమృత(24) గర్భం దాల్చడంతో నీలోఫర్ దవఖానలో ఫిబ్రవరి 22న అడ్మిట్ చేశారు. నెలలు నిండని అమృతకు అదేరోజు నొప్పులు రావడంతో 7వ నెలలోనే సిజేరియన్ చేసిన వైద్యులు తక్కువ బరువుతో ఇద్దరు మగ పిలల్లు, ఇద్దరు ఆడపిల్లలు జన్మించారని సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. కాగా పిల్లలు నెలలు నిండకముందే పుట్టడంతో పలు ఆరోగ్య సమస్యలతో ఉండడంతో నియోనటలాజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.స్వప్న పర్యవేక్షణలో ఐసీయూలో వెంటిలేటర్‌పై వైద్య అందించారు. ప్రస్తుతం పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్ ప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 29 : రాష్ట్రంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు చింతా భగవాన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మాదిగ సంఘాలు, ఉద్యోగ జేఏసీ, ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. 18 శాతం ఉన్న దళితుల్లో 10 శాతం మాదిగలు, ఎనిమిది శాతం మాలలున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు కనీసం రెండు మంత్రి పదవులు రావాలన్నారు. ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కార్పొరేషన్లు, ఎమ్మెల్సీ లాంటి పదవులను సైతం కేటాయించలేదన్నారు. మంత్రివర్గ విస్తరణలో ఒక మంత్రి పదవిని కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్ఆర్ మోహన్, ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఇప్లూ ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పన్నులు మనవి.... నిధులు ఉత్తరాదికా..?

నిష్పక్షపాతంగా కేటాయింపులు ఉండాలి

ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిడ్డి సుధాకర్




సమావేశంలో మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

ఖైరతాబాద్, మార్చి 29: కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో డీలిమిటేషన్ కాకుండానే భారీగా పన్నులు కట్టించుకొని నిధుల కేటాయింపులు మాత్రం ఉత్తరాది రాష్ట్రాలకు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాధి రాష్ట్రాల్లో జీఎస్టీ, సీజీఎస్టీ పేరిట పెద్ద ఎత్తున పన్నులను వసూలు చేస్తున్నారని, కాని ఇచ్చే విషయాన్ని వచ్చే సరికి కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా ఇదే తంతు సాగుతుందని, తాజాగా మళ్లీ డీలిమిటేషన్ పేరుతో అన్యాయాన్ని సిద్ధమవుతున్నారన్నారు. ఉత్తర భారతదేశంలో పార్లమెంట్ స్థానాలు ఇష్టారాజ్యాంగ పెంచుకొని, ఈ ప్రాంతాలకు మాత్రం మొండి చేయిచూపించే కార్యచరణ రూపొందిస్తున్నారన్నారు. గత ఏడాది జరిగిన బీహార్ ఎన్నికల్లో స్వయంగా ప్రధాన మంత్రి స్వయంగా ఆ రాష్ట్రానికి ఎన్ని నిధులు కావాలో బహిరంగ వేల ప్రకటనలా ఎన్నికల ప్రచారంలో అక్కడి ప్రజలను అడగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణ భారతదేశంలోని అన్ని పార్టీలు, ప్రభుత్వాలను కలుపుకొని పోరాడుతామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎంఆర్ వినోద్ రెడ్డి, ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, జగన్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# నక్సలిజాన్ని రూపుమాపి దేశాన్ని కాపాడుకుందాం





సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ, మాజీ డీజీపీ అరవిందరావు

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో నక్సలిజాన్ని రూపుమాపి దేశాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తద్వారా దేశ యువత, సైనిక బలగాలు, పౌరులను నక్సలిజం పేరు మీద జరిపే మారణ హోమం నుంచి రక్షించుకోవచ్చు అని అభిప్రాయపడ్డారు. మార్టీర్స్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (అమరవీరుల స్మారక పరిశోధన సంస్థ) (ఎంఎంఆర్ఐ) ఆధ్వర్యంలో చేంజింగ్ కలర్స్ ఆఫ్ నక్సలిజం అనే అంశంపై ఒకరోజు సదస్సును నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్ఆర్ సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా లోక్ సత్తా జయప్రకాష్ నారాయణ, మాజీ డీజీపీ అరవింద్ రావు, మాజీ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, సామాజిక సమరసత అఖిల భారత సంయోజక్ శ్యాంప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర మాజీ ఉపాధ్యక్షులు పేరాల శేఖర్ రావు, ఎంఎంఆర్ఐ అధ్యక్షులు పుట్టి మురళీ మనోహర్, కార్యదర్శి రంజిత్ మోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల భారత హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ 2026 మార్చి నెల వరకు దేశంలో నక్సలిజం అంతం చేస్తామని అన్నారని గుర్తు చేశారు. కాని నక్సలైట్లు వారి రంగు మార్చుకొని అర్బన్ నక్సలైట్ల పేరు మీద పట్టణాల్లో తిష్ట వేశారని ఆరోపించారు.